వార్త మిర్రర్

సోమవారం,
జూలై 18, 2022

తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 4 | వెల 4/-

జగజ్జననీ జనవాహిని

లష్కర్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల సంబురం అంగరంగ వైభవంగా ఆదివారం వేకువజాము నుంచి షురువైంది. తల్లి బైలెల్లినాదో.. నాయనో.. అమ్మా బైలెల్లినాదో.. అంటూ పోతరాజులు, శివసత్తుల నృత్యాలతో అమ్మవారి భక్తులు సందడిగా బోనాలతో సికింద్రాబాద్‌లోని అమ్మవారి ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజామున 4 గంటలకు అమ్మవారికి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ కుటుంబసమేతంగా తొలిపూజ నిర్వహించారు. అనంతరం భక్తుల దర్శనానికి అనుమతినిచ్చారు. ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు రెండేండ్ల తర్వాత భక్తులను పూర్తిస్థాయిలో అనుమతించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల వేడుక ఘటోత్సవంతో మొదలైంది. తెల్లవారుజాము 4 గంటలకు అమ్మవారికి మహాహారతి, కుంకుమ, పుష్పార్చనలు నిర్వహించారు. అమ్మవారికి సాకలు సమర్పించారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తడంతో కొవిడ్ నిబంధనలు పాటిస్తూ దర్శనం చేసుకోవాలని అధికారులు సూచించారు. కాగా అమ్మవారికి ఆలయ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించింది. ఆలయ పరిసరాల్లో 200సీసీ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. 2500 మంది పోలీసులతో భద్రత ఏర్పాట్లు చేశారు.

భారీ వర్షాల వెనుక విదేశీ కుట్ర అనటం ఈ శతాబ్దపు జోక్: సంజయ్

ఢిల్లీ: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో గోదావరి మహా ఉగ్రరూపం దాల్చింది. దీంతో తెలంగాణలోని చాలా ప్రాంతాలు జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంత ప్రజలు ఇంకా వరద నీటిలోనే ఉన్నారు. ఈ క్రమంలోనే వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు ముఖ్యమంత్రి కేసీఆర్. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ?్యలపై తీవ్ర విమర్శలు చేశారు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్ కుమార్. భారీ వర్షాల వెనుక విదేశీ కుట్ర ఉందనడం ఈ శతాబ్దపు జోక్ అంటూ దుయ్యబట్టారు. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికే కేసీఆర్ డ్రామాలాడుతున్నారని ఆరోపించారు బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్. 10వేల ఇండ్లతో కాలనీ, గోదావరిపై కరకట్ట నిర్మాణం పేరుతో మళ్లీ ప్రజలను వంచించే హామీలు ఇచ్చారని విమర్శించారు. కేసీఆర్ చేసిన తప్పిదాలవల్లే కాళేశ్వరం ప్రాజెక్టు మునిగిందన్నారు. వరదలపై ప్రజలను దారి మళ్లించేందుకే విదేశీ కుట్ర అంటూ వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. వారం రోజులుగా వరదలతో జనం అల్లాడుతుంటే పట్టించుకోని సీఎం.. ప్రాంతీయ పార్టీల నేతలతో రివ్యూలు చేస్తూ కేంద్రాన్ని బదనాం చేయడానికే పరిమితమయ్యారని పేర్కొన్నారు.

జుమ్లాపై జీఎస్టీ వేస్తే..

భారత్ ఎప్పుడో 10 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ అయ్యేది

ఆహారంపై జీఎస్టీ ఎందుకో.. మీ దగ్గర జవాబున్నదా?

ట్విట్టర్‌లో ప్రధాని మోదీని నిలదీసిన మంత్రి కేటీఆర్

హైదరాబాద్ : దేశంలో అత్యధిక మంది ఆహారంగా తీసుకొనే పాలు, పెరుగు, బియ్యంపై జీఎస్టీని పెంచడంపై మున్సిపల్, ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. జీఎస్టీ ఎందుకు పెంచారో.. సమాధానం ఏమైనా ఉన్నదా? మోదీ జీ అని ప్రశ్నించారు. ఈ దేశం కోసం మీ ప్రాధాన్యాలు ఏమిటో చెప్పాలని నిలదీశారు. జీఎస్టీ తీసుకురావడంతో రెండేండ్ల క్రితం పన్ను నుంచి బయటపడిన గోధుమలు, బియ్యం, పెరుగు, లస్సీ, మజ్జిగపై ఇప్పుడు ఎందుకు ట్యాక్స్ వేస్తున్నారో జవాబు ఇస్తారా అని ప్రశ్నిస్తూ ట్వీట్ల వర్షం కురిపించారు. 'గౌరవనీయులైన ప్రధానమంత్రి నరేంద్రమోదీ జీ.. ఈ దేశం కోసం మీ ప్రాధాన్యాలు ఏమిటి?మీ నాయకత్వంలో ద్రవ్యోల్బణం 30 సంవత్సరాల గరిష్ఠస్థాయికి చేరి, యావత్ భారతదేశం బాధపడుతున్నది. ఇప్పుడు మీరు దేశ ప్రధాన ఆహారాలైన పాలు, పెరుగు, బియ్యంపై జీఎస్టీ రేట్లను పెంచాలని నిర్ణయించారు. ఈ జీఎస్టీ ఎందుకు పెంచారో మీ దగ్గర సమాధానం ఉన్నదా సార్ ?' అని ప్రశ్నిస్తూ ముందు ఓ ట్వీట్ చేశారు. అంతేకాకుండా 'గోధుమలు, బియ్యం, పెరుగు, లస్సీ, మజ్జిగపై ప్రభుత్వం రేపటి నుంచి 5 శాతం జీఎస్టీ వసూలు చేయనున్నది. కానీ రెండేండ్ల క్రితం ప్రధాని మోదీ.. జీఎస్టీతో వీటన్నింటికీ పన్ను మినహాయింపు లభించిందని ప్రకటించిన వీడియో ఇది..వా మోదీ వా..' అంటూ ఆ వీడియోను ట్వీట్‌లో పోస్ట్ చేశారు. ఇలా కాకుండా 'జుమ్లా, జూట్ అండ్ ఫేక్ న్యూస్‌పై జీఎస్టీ వేస్తే.. ఇండియా ఇప్పటికే 10 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ అయ్యేది. జుమ్లా నిర్భర్ భారత్' అనే హాష్‌ట్యాగ్‌లో మరో ట్వీట్ చేసి ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

భద్రాద్రికి వెయ్యి కోట్లు

గోదావరి ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం.. ఎత్తైన ప్రాంతాల్లో కాలనీలు

కరకట్ట పటిష్ఠానికి చర్యలు

కరకట్ట మరమ్మతుపై ఏపీ ప్రభుత్వంతో చర్చిస్తాం

ప్రతి కుటుంబానికి రూ.10 వేలు

లోతట్టు ప్రాంతాలను అన్ని విధాలా ఆదుకుంటం

ములుగు, భద్రాచలంలో సిద్ధంగా 2 హెలికాప్టర్లు

వరద తగ్గే వరకు పునరావాస కేంద్రాలు

తక్షణ సాయం కింద గోదావరి జిల్లాలకు నిధులు

భద్రాచలం, రామన్నగూడెంలో సీఎం సమీక్ష

గోదావరి వరద జిల్లాల్లో సీఎం కేసీఆర్ పర్యటన

బాధితులకు పరామర్శ.. అండగా ఉంటామని భరోసా

హైదరాబాద్, జూలై 17 : భద్రాచలం ప్రాంతంలో వరద ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వెయ్యి కోట్లు కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రకటించారు. ఈ మొత్తంతో వరద బాధితులకు శాశ్వత ప్రాతిపదికన నివాస కాలనీల నిర్మాణాలు, భద్రాద్రి సీతారాముల దేవస్థానం చుట్టూ కరకట్ట అభివృద్ధి, బూర్గంపాడు వైపు ఉన్న కరకట్ట మరమ్మతులతోపాటు, ముంపు సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. వరద ముంపునకు గురైన ప్రాంతాలను ముఖ్యమంత్రి ఆదివారం ఏరియల్ వ్యూ, క్షేత్రస్థాయి పర్యటనలతో పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రాచలంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ, వరద ముంపు ప్రాంతాల ప్రజలెవరూ భయపడాల్సిన పని లేదని, వారి రక్షణకోసం అన్ని చర్యలు తీసుకొంటామని భరోసా ఇచ్చారు. తరచుగా వరదల్లో మునిగిపోతున్న భద్రాచలం వాసుల కన్నీళ్లను తుడిచేందుకు.. శాశ్వత ప్రాతిపదికన నివాస కాలనీలు నిర్మిస్తామని ప్రకటించారు. వరద చేరని ఎత్తైన ప్రదేశాల్లో అనువైన స్థలాలను గుర్తించి, బాధితులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి, నిర్మాణ కార్యక్రమాలు చేపట్టాలని కలెక్టర్ అనుదీప్‌ను సీఎం కేసీఆర్ ఆదేశించారు. తమకు శాశ్వత ప్రాతిపదికన రిలీఫ్ దొరకుతుండటంతో భద్రాచలం పునరావాస కేంద్రాల్లోని బాధితులు హర్షం వ్యక్తంచేశారు. వరద ముంపు ప్రాంతాల్లో పర్యటన కోసం శనివారం వరంగల్ జిల్లాకు చేరుకొని సమీక్షించిన సీఎం కేసీఆర్ హనుమకొండలో బస చేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు భద్రాచలానికి రోడ్డు మార్గాన బయలుదేరారు. ఉదయం 11 గంటలకు భద్రాచలం చేరుకొన్న సీఎం.. అకడ పర్యటించి, ముంపు ప్రాంతాల బాధితులను పరామర్శించారు. సమీక్షా సమావేశం జరిపారు. అకడి నుంచి ఏటూరునాగారం వరకు సీఎం కేసీఆర్ హెలికాప్టర్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ఏటూరు నాగారం నుంచి బయలుదేరిన సీఎం కేసీఆర్ ఆదివారం రాత్రి హనుమకొండలో బసచేశారు.

వరద నష్టం గురించి అందలేదా?

సీఎం కేసీఆర్‌పై వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం

హైదరాబాద్: 'విదేశీ కుట్రల మీద సమాచారం ఉన్న దొరకు.. వరదల నష్టం మీద సమాచారం అందలేదా' అని వైఎస్సార్ టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల వానల తర్వాత దొరకు ఇవ్వాళ తీరిక దొరికిందా అని ఎద్దేవా చేశారు. వరద బాధిత ప్రజలను చూసేందుకు దొర ఇప్పటికైనా గడి నుంచి బయట అడుగు పెట్టారని, ఏరియల్ సర్వే చేసి, రాష్ట్రంపై విదేశీ కుట్ర జరుగుతోందని సెలవిచ్చారని విమర్శించారు. వానలు, వరదలకు క్లౌడ్ బస్టర్ కారణమని కాకమ్మ కథలు చెప్పడం, బోడి గుండుకు మోకాలుకు ముడేసినట్లుందని వ్యాఖ్యానించారు. 'లక్షల్లో ఆస్తి నష్టపోయి, గూడు కోల్పోయి బాధితులకు ప్రకటించిన సాయమన్నా సరిగ్గా అందుతుందా లేదా జీహెచ్ఎంసీలో వరద సాయమని గులాబీ లీడర్లు స్వాహా చేసినట్టు చేస్తారా' అని సందేహం వ్యక్తం చేశారు.

నేడే రాష్ట్రపతి ఎన్నిక

ఓటేయనున్న 4,800 మంది ఎలక్టోరల్ కాలేజ్

పార్లమెంటు, అసెంబ్లీ ప్రాంగణాల్లో నిర్వహణ

పోలింగ్‌కు అన్ని రాష్ట్రాల్లో ఏర్పాట్లు పూర్తి

న్యూఢిల్లీ, జూలై 17: 15వ రాష్ట్రపతి ఎన్నికలు సోమవారం జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో ఎలక్టోరల్ కాలేజీ సభ్యులైన ఎంపీలు, ఎమ్మెల్యేలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరంతా 4,800 మంది దాకా ఉంటారు. ఢిల్లీలోని పాంర్లమెంటు భవనం, రాష్ట్రాల్లోని అసెంబ్లీ భవనాల్లో ఈ ఎన్నికలు జరుగనున్నాయి. బ్యాలెట్ పత్రాల్లో ఓటు వేసి బ్యాలెట్ బాక్సుల్లో వేస్తారు. జూలై 21న ఓట్ల లెక్కి ంపు జరుగనున్నది. 25వ తేదీన కొత్తగా ఎన్నికైన రాష్ట్రపతి ప్రమాణస్వీకారం చేస్తారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అభ్యర్థిగా ద్రౌపది ముర్ము, విపక్షాల తరఫు అభ్యర్థిగా యశ్వంత్ సిన్హా బరిలో ఉన్న విషయం తెలిసిందే. ఎంపీలు ఆకుపచ్చ రంగు బ్యాలెట్ పత్రాల్లో, ఎమ్మెల్యేలు పింక్ రంగు బ్యాలెట్ పత్రాల్లో తమ ఓటు వేయనున్నారు. రాష్ట్రపతి ఎన్ని కల్లో ఎమ్మెల్యేలు, ఎంపీల ఓటు విలువ వేర్వేరుగా ఉంటుంది. 1971 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రాల జనాభాను బట్టి ఎమ్మెల్యేల ఓటు విలువ నిర్ధారిస్తారు.

కేంద్రాన్ని నిలదీస్తాం

టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, టీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు

హైదరాబాద్, జూలై 17 : సమాఖ్య స్ఫూర్తిని పాతరేస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్లమెంటులో పోరాడుతామని టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, లోక్‌సభలో టీఆర్ఎస్ పక్ష నేత నామా నాగేశ్వర్‌రావు తెలిపారు. ప్రజావ్యతిరేక మోదీ సర్కార్ దిగిపోవాల్సిందేనని చెప్పారు. పార్లమెంటు సమావేశాల్లో ప్రజా సమస్యలే టీఆర్ఎస్ ఎజెండా అని స్పష్టంచేశారు. ఆదివారం పార్లమెంటు ప్రాంగణంలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంతో పాటు ఎన్సీపీ అధినేత శరద్‌పవార్ ఇంట్లో 17 విపక్ష పార్టీలతో నిర్వహించిన సమావేశంలోనూ కేకే, నామా పాల్గొన్నారు.

నిజాన్ని నిర్భయంగా చెప్పాలనుకుంటున్నారా..

అయితే వార్త మిర్రర్
డిజిటల్ తెలుగు పత్రిక మీకు అవకాశం కల్పిస్తోంది!

మీ ప్రాంత సమస్యలపై మీకు అవగాహన ఉందా?..., మీ ప్రాంత సమస్యలను, పాలకులు , ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకురా దాల్చారా ??, అయితే ఇంకా ఎందుకు ఆలస్యం..వార్తా మిర్రర్ డిజిటల్ పత్రికలో విలేకరులు గా చేరండి... ప్రజా సమస్యల పరిష్కారానికి వారధులుగా మారండి.

8121529009
9949222450

విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

ట్రిపుల్ ఐటీ ఘటన కు మంత్రి నే పూర్తి బాధ్యత వహించాలి

విద్యా వ్యవస్థ నిర్వీర్యం చేస్తున్న కేసీఆర్

బహుజన బిడ్డలకు విద్య ను దూరం చేయాలన్నదే ఆయన కుట్ర

కాంగ్రెస్ ఫీజు రీయింబర్స్మెంట్ తెస్తే... దానికి తిలోదకాలు ఇచ్చిన తెరాస ప్రభుత్వం

మహేశ్వరం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి

మహేశ్వరం, వార్త మిర్రర్ : తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గా వ్యవహరిస్తున్న సబితా ఇంద్రారెడ్డి అసమర్థతను చూసి, మహేశ్వరం నియోజకవర్గం ప్రజలు సిగ్గుపడాల్సిన పరిస్థితి నెలకొన్నదని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్ రెడ్డి అన్నారు. నియోజకవర్గ సమస్యలను గాలికి వదిలేసిన మంత్రి, తన శాఖా నిర్వాహనలోనూ అంతే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. మహేశ్వరం మండలం హెడ్ క్వార్టర్స్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ గత కొన్ని వారాల క్రితం బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులు వారి సమస్యల పరిష్కారానికి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ వారు పెద్ద ఎత్తున నిరసన తెలియజేసి, ప్రభుత్వం పై పెద్ద ఉద్యమం చేసి వారి డిమాండ్లను సాధించుకున్నారన్నారు. ప్రభుత్వ ప్రతినిధిగా నిన్న కాక మొన్న బాసర ట్రిపుల్ ఐటీ కి వెళ్లిన మన విద్యాశాఖ మంత్రి అక్కడి విద్యార్థులకు నేను మీకు ఒక అమ్మ లాగా, అక్క లాగా ఉంటానని కల్లిబోల్లి మాటలు చెప్పి విద్యార్థులను మభ్యపెట్టి మోసం చేశారన్నారు. వారు వెల్లి సమస్యలను పరష్కస్తారని హామీ ఇచ్చిన వారం రోజులకే నేడు మళ్ళీ బాసర ట్రిపుల్ ఐటీ లో విష పూరిత ఆహార పదార్థాలను అందించి, ఆ ఆహారం తిన్న వేలాది మంది విద్యార్థులు నేడు అస్వసత కు గురై ఆసుపత్రి పలుచేసిన ఘనత టి ఆర్ ఎస్ ప్రభుత్వానికే చెల్లిందాన్నారు. సన్న బియ్యం వండి పెడుతున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం పేద విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వం కుట్ర పూరితంగా వ్యవహరిస్తూ బడుగు బలహీనర్గాలకు చదువు వస్తే రాజ్యాధికారం కావాలంటారనీ, అందుకే ఆయా వర్గాలకు చదువు అందకుండా మొత్తం విద్యా వ్యవస్థనే కేసీఆర్ నాశనం చేస్తున్నారని ధ్వజమెత్తారు. చదువు రాని వారికి విద్యా శాఖ అప్పగించి విద్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని మండి పడ్డారు. ముఖ్యమంత్రి తన పార్టీకి చెందిన నేతలకు యూనివర్సిటీలు ఇస్తున్నారనీ, బహుజన బిడ్డలు చదువుకునే ఓయూ, కేయు ఇతర ప్రభుత్వ విశ్వవిద్యాలయాలను పట్టించుకోవడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన ఫీజు రియంబర్స్ మెంట్ ని కావాలని పక్కన పెట్టారన్న దేప భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదనీ విమర్శించారు. ఉపాధ్యాయులకు పిఆర్సి ఇవ్వడం లేదు, పదోన్నతులు కల్పించడం లేదు, విద్యార్థులకు మెస్ చార్జీలు చెల్లిండం లేదన్నారు. విద్యా విధానాన్ని నాశనం చేస్తున్న కేసీఆర్ కి వ్యతిరేకంగా ప్రజలు కాంగ్రెస్ తో కలిసి రావాలన్నారు. విద్యాశాఖ లో జరుగుతున్న లోపలకు, విద్యార్థులకు జరిగిన అసౌకర్యానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్, మహేశ్వరం గ్రామశాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అల్లే కుమార్, యువజన కాంగ్రెస్ నాయకులు నల్లెంకి ధనరాజ్ గౌడ్, చెపంగి ప్రవీణ్, ఏపూరి నరసింహా, దశరథ నాయక్, సంగా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ, అవినీతిని ప్రశ్నిస్తున్న గొంతులను నొక్కి వేయడం పిరికిపంద చర్య

మోర్తాడ్(వార్త మిర్రర్) : నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మోర్తాడ్ మండలంలోని మహాత్మ జ్యోతి పూలె విగ్రహం దగ్గర ముఖ్యమంత్రి KCR ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టినటు వంటి కాళేశ్వరం ప్రాజెక్టు రానున్న రోజులలో తెలంగాణ రాష్ట్రానికి గుది బండగా మారే ప్రమాదముందని ఎన్నో వేదికల మీద ప్రభుత్వాన్ని హెచ్చరించినటు వంటి మాజి విశ్రాంత IAS అధికారి శ్రీ ఆకునూరి మురళి నిన్న కాళశ్వరం వద్ద ఇటీవల వచ్చినటు వంటి వరదకు ముంపునకు గురైన పంపుహేజులను పరిశీలించడానికి వెళ్ళినపుడు అరెస్టు చేయడం అత్యంత హేయమైన పిరికిపందా చర్యగా పరిగణిస్తున్నము అన్నారు.. ఆకునూరి మురలి ఇటివల RTI చట్టం ద్వారా తెలంగాణ ప్రభుత్వం విద్యపై ఖర్చు పెట్టకుండా దారి మల్లించి నిరుపయోగపర్చిన రూ? 9500 కోట్ల నిధుల వివరాలు బయటకు తీసి %ు=ూ% ప్రభుత్వానికి విద్యపై ఉన్న నిబద్ధతను తెలంగాణ సమాజానికి మరియు జాతియావత్తుకు తెలియజేసినందుకు ఆయనపై కక్షగట్టిన ప్రభుత్వం, తన అసమర్థ విధానాలను, అవినీతిని ప్రశ్నిస్తున్న మెధావులను (వర్గాలను) అరెస్టుల పెరుమీద హింసించి భయబ్రాంతులకు గురిచేస్తుంది. మియొక్క ఇలాంటి పిరికిపందా చర్యలను బహుజన సమాజ్ పార్టీ మోర్తాడ్ మండల కమిటి తరపున తీవ్రంగా ఖండిస్తున్నాం. అలాగే ఇలాంటి పిరికిపందా చర్యలకు బయపడేవాళ్లు తెలంగాణ సమాజంలో ఎవరు లేరని, రానున్న రోజులతో ప్రభుత్వం తన విధానాలను మార్చుకోకపోతే ప్రజలు తగిన గుణపాఠం నేర్పడానికి సిద్దంగా ఉన్నారని BSP మండల అధ్యక్షులు మల్లూరి బాబురావు, కోకన్వీనర్ సదానంద్, BSP బాల్కొండ అసెంబ్లీ కమిటి ప్రధాన కార్యదర్శి సురేష్ సాహు హెచ్చరించారు ఈ కార్యక్రమములో Bsp పార్టీ నాయకులు తదిదారులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే ముందస్తు ఎన్నికలంటూ ప్రచారం

బీజేపీ వైపు ఆకర్షితులవుతున్న యువత

వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓటమి ఖాయం

మహేశ్వరం బీజేపీ ఇన్చార్జ్ శ్రీరాములు యాదవ్

బాలాపూర్, వార్త మిర్రర్ : ముందస్తు ఎన్నికలు అంటూ సీఎం కేసీఆర్ సహా గులాబీ దండు ప్రచారం చేసుకుంటుందని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ శ్రీరాములు యాదవ్ ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో టీఆర్ఎస్ పార్టీ తుడిచి పెట్టుకోని పోవటం ఖాయమన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురుతున్నదన్నారు. బడంగ్ పేట కార్పొరేషన్ అల్మాస్ గూడ 26వ డివిజన్ నుంచి బీజేపీలో పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు చేరారు. కార్పొరేషన్ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు జంగారెడ్డి ఆధ్వర్యంలో మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ కార్యాలయంలో కండువాలు కప్పుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్ఛార్జి అందెల శ్రీరాములు... ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరిన మహిళలు, యువకులను స్వాగతించారు. ప్రభుత్వాన్ని రద్దు చేసి దమ్ముంటే ముందస్తు ఎన్నికలకు రావాలని అందెల శ్రీరాములు సవాల్ విసిరారు. బడంగ్ పేట, మీర్ పేట కార్పొరేషన్లల్లో అనేక కాలనీలు నీట మునిగి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మంత్రి సబితా ఇంద్రారెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, మంత్రి సబితమ్మ ఒకే గూటికి చేరి ఓట్లు వేసిన నియోజకవర్గం ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. చెరువులు, భూకబ్జా ఆరోపణలు చేసిన తీగల... ఎందుకు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయటం లేదన్నారు. నియోజకవర్గ ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను గమనించి ఇద్దరు గేమ్ ఆడుతున్నారని అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కొలన్ శంకర్ రెడ్డి, సామ సంజీవరెడ్డి, గుర్రం మల్లారెడ్డి, టేకుల భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్లు నిమ్మల సునీతాశ్రీకాంత్ గౌడ్, పద్మ ఐలయ్య, బ్యాంకు డైరెక్టర్లు తోట ప్రతాప్, గిరిరాజ్, జీఎస్ లు దొడ్డి మల్లికార్జున్, జోరాల ప్రభాకర్, మధుసూదన్ రెడ్డి, వరికుప్పల వెంకటేశ్, శ్రీకంత, మహిళా మోర్చా అధ్యక్షురాలు మమతా ఆనంద్, బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగుడెం రామకృష్ణారెడ్డి, సురేష్, దొడ్డి శ్రీశైలం సహా బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

బిజెపి నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

బాలాపూర్, వార్త మిర్రర్ : బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బిజే వై ఎం నాయకుడు కొర్ర జయరామ్ చౌహాన్ బీజేపీ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసి తన అనుచరులతో కలిసి , బడంగ్ పేట్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్ద బావి వెంకట్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పారిజాత నరసింహా రెడ్డి , మహేశ్వరం నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బోయపల్లి రాఘవేందర్ రెడ్డిలు కాంగ్రెస్ పార్టీలో చేరిన సాయి , మురళి , ఉదయ్ , సాయి కుమార్ , విశాల్ మరియు పెద్దఎత్తున బిజెపి కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి , రాళ్ల గూడెం సంతోషా శ్రీనివాస్ రెడ్డి , 5 వ డివిజన్ సీనియర్ నాయకులు ప్రతాప్ రెడ్డిలు పాల్గొన్నారు ....

అందరికీ ఉపయోగపడే విధంగా పంక్షన్ హాల్ నిర్మించాలి

సరూర్ నగర్ కాంగ్రెస్ నేతలు డిమాండ్

సరూర్ నగర్, వార్త మిర్రర్ : మహేశ్వరం నియోజకవర్గం,%ఎ% సరూర్ నగర్ డివిజన్ భగత్ సింగ్ నగర్ లో ప్రభుత్వం నిర్మాణం చేస్తున్నా మినీ పంక్షన్ హాల్ ను స్థానిక ప్రజలకు ఉపయోగ పడే విధంగా నిర్మించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. కాలనీ వాసులందరికీ ఉపయోగ పడే విధంగా కాకుండా, కాంట్రాక్టర్ తన స్వలాభానికి అనుగుణంగా నిర్మాణం చేయడాన్ని సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక ప్రజలతో కలిసి వెళ్ళి అక్కడ జరుగుతున్న నిర్మాణాన్ని పరిశీలించి, ఆ నిర్మాణాన్ని ఆపి, అందరికీ ఉపయోగపడేలా నిర్మాణం పూర్తి చెయ్యాలని జోనల్ కమిషనర్, డి ఈ లకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు సరూర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిక్కుళ్ళ శివ ప్రసాద్, రాష్ట్ర యువజన నాయకుడు ధనరాజ్ గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గుల్షన్, జనరల్ సెక్రటరీ ఇమ్రాన్ అలీ, డివిజన్ ఎస్ సి సెల్ అధ్యక్షుడు సంతోష్ కుమార్ సరూర్ నగర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్లు భాస్కర్ గారు ఐత రాజురమేష్ గారు ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు గారు ఎన్ఎస్ఈఐ రంగారెడ్డి జిల్లా సెక్రెటరీ చింతకింది రంజిత్ , సరూర్ నగర్ డివిజన్ మహిళా అధ్యక్షురాలు సరిత, డివిజన్ సెక్రెటరీ అరుణ సుశీల యాదమ్మ ఉమా శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించిన అభిమన్యురెడ్డి

వార్త మిర్రర్ ప్రెస్ జడ్చర్ల : రాజాపూర్ మండలంలో దొండ్లపల్లి గ్రామనికి చెందిన నెల్లి శాంతమ్మ(45) అనారోగ్యంతో మరణించారు.మృతికి సంతాపం తెలిపిన దొండ్లపల్లి ఎంపీటీసీ TRS పార్టీ యువనేత చించోడ్ అభిమన్యు రెడ్డి అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులకు 5000/-రూపాయలు ఆర్థిక సహాయన్ని యువసేన సభ్యుల ద్వారా అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి రంజీత్ గౌడ్, నర్సిములు, శశిధర్, మహేష్, శ్రీనివాసులు, వంశీకృష్ణ గౌడ్, రామస్వామి, నాగారాజు, కృష్ణయ్య, యాదయ్య, రాజు, చాకలి యదయ్య మరియు TRS పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

రాజాపూర్ మండల కేంద్రంలో భగత్ సింగ్ యూత్ క్లబ్ నూతన అధ్యక్షుడి ఎన్నిక

వార్త మిర్రర్ ప్రెస్ జడ్చర్ల : రాజాపూర్ మండల కేంద్రంలో ఆదివారం నాడు భగత్ సింగ్ యూత్ క్లబ్ సభ్యుల సమక్షంలో హనుమాన్ దేవాలయం దగ్గర నూతన అధ్యక్షుని మరియు కార్యవర్గ సభ్యులనుఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్షుడిగా పోలేపల్లి మని చరణ్, ఉపాధ్యక్షులు వడ్ల అమర్నాథ్, ప్రధాన కార్యదర్శి అభిరామ్, రాకేష్, కమిటీ సభ్యులు మణికంత, మధు, మహేష్, ప్రవీణ్, నవీన్ గౌడ్, వినోద్ చారి, కార్తీక్ లను ఎన్నుకోవడం జరిగింది ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వనపర్తి నరహరి,వనపర్తి సత్తయ్య, మాధవ్ చారి, W.రాజు, డబ్ల్యూ నర్సింలు, డబ్ల్యూ సూరి, నరసింహ, దేవేందర్, రమణ, రమణ, రాజు, శేఖర్ మరియు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు

బోనాల వేడుకల్లో బడంగ్పేట మేయర్

బాలాపూర్, వార్త మిర్రర్ : మహేశ్వరం నియోజకవర్గంలో జల్ పల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ్ నగర్ లో జరిగిన బోనాల పండుగ ఉత్సవాలలో బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పాల్గొని, అమ్మవారికి బోనం సమర్పించారు. అనంతరం తుక్కుగుడా మున్సిపాలిటీ పరిధిలోని మంఖల్ బోనాల ఉత్సవాలలో పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆ అమ్మలగన్న అమ్మగారి ఆశీస్సులతో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, బంగారి బాబు, కార్పొరేటర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి, సమద్ బిన్, రవి, తుక్కుగుడా మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జంపన్న యాదవ్, ఉపాధ్యక్షుడు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రానున్నది బిజెపి ప్రభుత్వమే

పెద్ద సంఖ్యలో బిజెపిలో చేరికలు

మోడీ విధానాలకు ఆకర్షితులవుతున్న సామాన్యులు

బిజెపి రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్ రెడ్డి

మహేశ్వరం, వార్త మిర్రర్ : రానున్న ఎన్నికల్లో బిజెపి విజయ డంకా మోగించి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని రాష్ట్ర బిజెపి నాయకుడు, సింగల్ విండో మాజీ చైర్మన్ కొలన్ శంకర్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. టిఆర్ఎస్ సర్కార్ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు చూసి విసిగిపోయిన ప్రజలు ప్రత్యామ్నాయంగా బిజెపి వైపు చూస్తున్నారని చెప్పారు. బడంగ్ పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ నుంచి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కొలన్ శంకర్ రెడ్డి సమక్షంలో బిజెపిలో చేరారు. వారికి పార్టీ కండువాలను కప్పి సాదరంగా కొలను శంకర్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చూసి సామాన్యులు సైతం బిజెపిలో చేరడానికి ఉత్సాహాన్ని చూపిస్తున్నారని తెలిపారు.

ఎస్‌యూవీ క్రేజ్ తగ్గేదేలే

సేఫ్టీ, కంఫర్ట్‌తో పాటు సన్‌రూఫ్, టెక్నాలజీ కనెక్టెడ్ ఫీచర్లకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ తరహా పాపులర్ మోడల్ కార్ల కోసం కొన్ని సార్లు రెండు సంవత్సరాలు వరకూ వేచి చూస్తున్నారు కూడా. ప్రస్తుతం ఎస్‌యూవీలకు ఉన్న క్రేజ్ అలాంటిది మరి. గతంలో హ్యాచ్‌బ్యాక్‌లు సేల్స్ చార్ట్‌లలో ఆధిపత్యం చెలాయించేవి, కానీ ఎంట్రీ-లెవల్, మిడ్-సైజ్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్స్ (%ూఖఎ%) ఇటీవల కాలంలో జనాదరణ ఎక్కువ పొందుతున్నాయి. మారుతీ సుజుకీ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (సేల్స్ అండ్ మార్కెటింగ్) శశాంక్ శ్రీవాస్తవ మాట్లాడుతూ.. గత కొన్ని సంవత్సరాల్లో ఎస్‌యూవీ (SUV) సెగ్మెంట్ అమ్మకాలలో వృద్ధిని సాధిస్తోంది. పరిశ్రమలో దాదాపు 19 శాతం ఉన్న ఎస్‌యూవీ విభాగం 2021-22లో 40 శాతానికి పెరిగింది.

GHMC hmda Growing Global TS-bPASS
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
Mob : 9393929595, 9393446188

క్రిప్టో.. ఇంకా తప్పటడుగులే!

ఫండమెంటల్స్ లేని సాధనాలు స్థిరత్వం తక్కువ.. ఆటుపోట్లు ఎక్కువ నియంత్రణల్లేని చోట రిస్క్ అపరిమితం అంత రిస్క్ భరించే రిటైల్ ఇన్వెస్టర్లు తక్కువ ఈక్విటీ మార్కెట్లతో పోల్చుకోవద్దు నియంత్రిత సాధనాలే మెరుగైన మార్గం అవగాహన లేమితో నష్టాలు తెచ్చుకోవద్దని నిపుణుల సూచన

క్రిప్టో కరెన్సీలు ఈ స్థాయిలో పడిపోతాయని ఒక్క ఇన్వెస్టర్ కూడా ఊహించి ఉండడు. ప్రధాన క్రిప్టో కరెన్సీలు గరిష్టాల నుంచి మూడింట రెండొంతుల మేర విలువను కోల్పోయాయి. ఇక చిన్న క్రిప్టోలు, మీమ్ కాయిన్ల పరిస్థితి మరింత దారుణం. 2017లో క్రిప్టో కరెన్సీల మార్కెట్ విలువ 620 బిలియన్ డాలర్లు. అక్కడి నుంచి 2021 నవంబర్ నాటికి అమాంతం 3 లక్షల కోట్ల డాలర్లకు దూసుకెళ్లింది. ఆ బుడగ పేలడంతో 2022 జూన్ నాటికి లక్ష కోట్ల డాలర్లకు కుప్పకూలింది. 2021 ఆగస్ట్ 11న బిట్ కాయిన్ ధర 67,566 డాలర్లు. ఇప్పుడు 20,000 దరిదాపుల్లో ఉంది. రెండో అతిపెద్ద క్రిప్టో కరెన్సీ ఎథీరియం కూడా ఇదే రీతిలో ఇన్వెస్టర్లకు చేదు ఫలితాలను ఇచ్చింది. గడిచిన ఆరు నెలల్లో ఈక్విటీ మార్కెట్లు ప్రపంచవ్యాప్తంగా నష్టాలను చూస్తున్నాయి. కేంద్ర బ్యాంకులు ద్రవ్య లభ్యతను తగ్గించే చర్యల వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. పెరిగిపోయిన ద్రవ్యోల్బణం వాటికి మరో దారి లేకుండా చేసింది. ఈ పరిస్థితుల్లో ఇన్వెస్టర్లు తెగనమ్మడం మొదలు పెట్టారు. దాంతో ఈక్విటీ మార్కెట్లు కూడా తీవ్ర నష్టాలను చవిచూశాయి. కానీ, క్రిప్టో కరెన్సీలు వేరు. ఇవి స్వేచ్ఛా మార్కెట్లు. కావాలంటే ఒకే రోజు నూరు శాతం పెరగగలవు. పడిపోగలవు. వీటిపై ఏ దేశ నియంత్రణ సంస్థకు నియంత్రణ లేదు. అసలు వీటికి ఫండమెంటల్స్ అంటూ ఏమీ లేవు. కొత్త తరహా సాధనాలు ఇవి. ప్రపంచవ్యాప్తంగా కరోనా విపత్తు నుంచి ఆర్థిక వ్యవస్థలను బయట పడేసేందుకు కేంద్ర బ్యాంకులు నిధుల లభ్యతను పెంచాయి. అవి ఈక్విటీలతోపాటు క్రిప్టోలను వెతుక్కుంటూ వెళ్లాయి. ఇప్పుడు లిక్విడిటీ వెనక్కి వెళుతుండడం వాటి ఉసురుతీస్తోంది. అందుకే పెట్టుబడులను ఎప్పుడూ జూదం కోణంలో చూడకూడదు. దీర్ఘకాల దృష్టిలో, తమ రిస్క్ సామర్థ్యం ఆధారంగా సరైన సాధనాల్లో పెట్టుబడులు పెట్టుకుంటేనే సంపద సాధ్యపడుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

భారీ ర్యాలీకి కారణం..

అంతర్జాతీయ ఫండ్స్ నిర్వహణ సంస్థలైన జేపీ మోర్గాన్ చేజ్, బ్లాక్‌రాక్ పెద్ద ఎత్తున బిట్‌కాయిన్లలో పెట్టుబడులు పెట్టాయి. స్వల్పకాలంలో ఎక్కువ రాబడులను ఇన్వెస్టర్లకు పంచిపెట్టాలన్న కాంక్ష, వైవిధ్య కోణం ఫండ్స్ మేనేజర్లతో అలా చేయించి ఉండొచ్చు. 2021 అక్టోబర్ 19న అమెరికాలో మొదటి బిట్‌కాయిన్ ఈటీఎఫ్‌లో ట్రేడింగ్ మొదలైంది. లిక్విడిటీకితోడు, పెద్ద సంస్థలు సైతం క్రిప్టో మార్కెట్లోకి అడుగు పెట్టడం భారీ ర్యాలీకి ఊతంగా నిలిచింది. ఇదే అదనుగా ఆల్ట్ కాయిన్లకు కూడా డిమాండ్ ఏర్పడింది. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ క్రిప్టోలకు సెలబ్రిటీగా మారిపోయారు. క్రిప్టోవేవ్‌ను అనుకూలంగా మలుచుకునేందుకు భారత్‌లో క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లు దినపత్రికల్లో ఫుల్ పేజీ ప్రకటనలు, టీవీల్లో ప్రకటనలతో ఇన్వెస్టర్లను ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేశాయి. ఇవన్నీ కలసి ఈ మార్కెట్లో 'ఫోమో' (అవకాశాన్ని కోల్పోతామేమోనన్న ఆందోళన)కు దారితీసింది.

ఎక్స్ఛేంజ్‌లకు గడ్డుకాలం...

క్రిప్టో లావాదేవీలకు వీలు కల్పిస్తున్న దేశీ ఎక్స్ఛేంజ్‌లు తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయి. ట్రేడింగ్ వ్యాల్యూమ్ 80 శాతానికి పైగా పడిపోవడం వాటికి దిక్కుతోచనీయడం లేదు. దీంతో ఆర్థికంగా బలంగా లేని ఎక్స్ఛేంజ్‌లు దినదిన గండం మాదిరి నెట్టుకొస్తున్నాయి. ప్రముఖ క్రిప్టో ఎక్స్ఛేంజ్ వజీర్‌ఎక్స్‌లో జనవరిలో ట్రేడింగ్ పరిమాణం 39 మిలియన్ డాలర్లు కాగా, క్రమంగా తగ్గుతూ జూన్‌లో 9.67 మిలియన్ డాలర్లకు పడిపోయింది. అన్ని ప్రధాన ఎక్స్ఛేంజీల్లో ఇదే పరిస్థితి ఉన్నట్టు ఈ టేబుల్‌లోని గణాంకాలను చూస్తే తెలుస్తుంది.

పన్ను పిడుగు

క్రిప్టో ఇన్వెస్టర్లు ఇప్పుడు అయోమయ పరిస్థితి ఎదుర్కొంటున్నారు. క్రిప్టో కరెన్సీలు భారీగా పడిపోవడం వల్ల లాభాల సంగతేమో కానీ, నష్టాలపాలైన వారే ఎక్కువగా ఉన్నారు. ఈక్విటీల మాదిరి మూలధన నష్టాలను, మూలధన లాభాలతో సర్దుబాటుకు క్రిప్టోల్లో అవకాశం లేదు. ఒక లావాదేవీలో లాభపడి, మరో లావాదేవీలో నష్టపోతే.. లాభం వచ్చిన మొత్తంపై 30 శాతం పన్ను కట్టాలని నూతన నిబంధనలు చెబుతున్నాయి. ఈక్విటీల్లో అయితే మూలధన నష్టాలను ఎనిమిది ఆర్థిక సంవత్సరాల పాటు క్యారీ ఫార్వార్డ్ చేసుకోవచ్చు. ఉదాహరణకు మంజిత్ చాహర్ (42) క్రిప్టోల్లో రూ.లక్ష ఇన్వెస్ట్ చేశాడు. తొలుత కొన్ని లావాదేవీల్లో అతడికి రూ.

25,000 లాభం వచ్చింది. కానీ, ఆ తర్వాత పెట్టుబడిపై రూ. 45,000 నష్టపోయాడు. అంటే అతడి రూ. లక్ష కాస్తా రూ. 80,000కు పడిపోయింది. అయినా కానీ, రూ. 25,000 లాభంపై అతడు 30 శాతం చొప్పున రూ. 7,500 పన్ను చెల్లించాల్సిందే. బిట్‌కాయిన్‌లో లాభం వచ్చి, బిట్ కాయిన్‌లోనే నష్టం వస్తే వాటి మధ్య సర్దుబాటుకు అవకాశం ఉంది. కానీ, బిట్‌కాయిన్‌లో లాభపడి, ఎథీరియంలో నష్టం వస్తే సర్దుబాటుకు అవకాశం లేదు. "క్రిప్టో లాభాలపై పన్ను 30 శాతం. కానీ, నష్టాలను లాభాల్లో సర్దుబాటు చేసుకునేందుకు అవకాశం లేదు కనుక, నికర పన్ను 50%--%60 శాతంగా ఉంటుంది"అని చార్డర్డ్ క్లబ్ డాట్ కామ్ వ్యవస్థాపకుడు కరణ్ బాత్రా తెలిపారు. క్రిప్టోల్లో లాభం వచ్చిన ప్రతి విడత ఒక శాతం టీడీఎస్ కట్ అవుతుంది. ఎక్కువ ట్రేడింగ్ చేసే వారికి టీడీఎస్ రూపంలో కొంత పెట్టుబడి బ్లాక్ అవుతుంది. పైగా స్టాక్ బ్రోకర్ల మాదిరి, మూలధన లాభాల స్టేట్ మెంట్లను అన్ని క్రిప్టో ఎక్స్ఛేంజ్‌లు జారీ చేయడం లేదు.

విదేశాలకు మకాం

క్రిప్టో పన్నుల విధానం పట్ల ఇన్వెస్టర్లు సంతోషంగా లేరని పరిశ్రమ చెబుతోంది. వజీర్‌ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ రాజగోపాల్ మీనన్ దీని గురించి వివరిస్తూ.. "తరచూ, అధిక పరిమాణంలో క్రిప్టోల్లో ట్రేడింగ్ చేసే వారు ఇప్పుడు వారి వ్యాపారాన్ని సింగపూర్, దుబాయ్ వంటి మార్కెట్లకు తరలించారు. అక్కడ క్రిప్టోలకు సంబంధించి మెరుగైన పన్ను విధానాలు అమల్లో ఉన్నాయి. వారు ఇప్పుడు దేశీ ఎక్స్ఛేంజీల్లో ట్రేడింగ్ నిలిపివేశారు"అని వివరించారు. తాజా ప్రతికూల పరిస్థితుల వల్ల 30%--%40 చిన్న ఎక్స్ఛేంజ్‌లు తీవ్ర సంక్షోభంలో పడినట్టు చెప్పారు. ఇన్వెస్టర్లు పెట్టుబడులు వెనక్కి తీసేసుకోకుండా కొన్ని ఎక్స్ఛేంజ్‌లు నియంత్రిస్తున్న వార్తలను ప్రస్తావించారు. తమ ఇన్వెస్టర్లు కొందరు దుబాయి, ఐర్లాండ్‌కు కార్యకలాపాలను తరలించినట్టు ఓ చార్టర్డ్ అకౌంటెంట్ సైతం తెలిపారు. "సంస్థ లేదా వ్యక్తి రూ.50 కోట్ల లోపు టర్నోవర్ ఉంటే కేంద్ర ప్రభుత్వం పన్ను విధించడం లేదు. ఉదాహరణకు ఒక ఇన్వెస్టర్ విదేశాల్లో రూ.15 కోట్లను క్రిప్టోల్లో ఇన్వెస్ట్ చేసి ఉంటే.. అతడికి లాభాల రూపంలో రూ.10%--%15 లక్షలు ఆదా అవుతుంది"అని వివరించారు.

నియంత్రణలు..

ప్రపంచవ్యాప్తంగా ఏ ప్రముఖ ఆర్థిక వ్యవస్థ కూడా క్రిప్టోకరెన్సీలను అనుమతించడం లేదు. క్రిప్టోలు, నాన్ ఫంజిబుల్ టోకెన్లకు నేపథ్యంగా ఉన్న బ్లాక్‌చైన్ సాంకేతికతను భవిష్యత్తు టెక్నాలజీగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. అయినా సరే క్రిప్టోలతో ఆర్థిక అనిశ్చితులకు అవకాశం ఇవ్వరాదన్నదే నియంత్రణ సంస్థల అభిప్రాయం. "ఫేస్‌బుక్ మొదలు పెట్టిన 'లిబ్రా' పట్ల చాలా మందిలో ఆసక్తి కనిపించింది. కానీ, దీనికి ఆదిలోనే నియంత్రణ సమస్యలు ఎదురయ్యాయి. టెలిగ్రామ్ మొదలు పెట్టిన బ్లాక్‌చైన్ టెక్నాలజీ ఆధారిత 'టాన్'ను నిలిపివేయాలని యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశించింది"అని వజీర్‌ఎక్స్ వైస్ ప్రెసిడెంట్ రాజగోపాల్ మీనన్ వివరించారు. 2018లో క్రిప్టో లావాదేవీలకు రూపీ చెల్లింపుల సేవలను అందించొద్దంటూ బ్యాంకులను ఆర్‌బీఐ ఆదేశించింది. దీనిపై ఇన్వెస్టర్లు సుప్రీం కోర్టుకు వెళ్లి అనుకూల ఆదేశాలు తెచ్చుకున్నారు. అయినా కానీ, క్రిప్టోలతో జాగ్రత్త అంటూ ఆర్‌బీఐ హెచ్చరిస్తూనే వస్తోంది. కేంద్ర ప్రభుత్వం సైతం క్రిప్టో లాభాలపై 30 శాతం మూలధన లాభాల పన్నును అమల్లోకి తీసుకొచ్చింది. లాభం నుంచి ఒక శాతం టీడీఎస్‌ను ఎక్స్ఛేంజ్‌ల స్థాయిలోనే మినహాయించే నిబంధనలను ప్రవేశపెట్టింది. మొత్తం మీద ఇన్వెస్టర్లను క్రిప్టోల విషయంలో నిరుత్సాహ పరిచేందుకు తనవంతుగా కేంద్ర సర్కారు చర్యలు తీసుకుందని చెప్పుకోవాలి.

ఈక్విటీలు, క్రిప్టోలకు పోలిక?

క్రిప్టోలను సమర్థించే వారు ఈక్విటీ, బాండ్ మార్కెట్లలో అస్థిరతలు లేవా? అని ప్రశ్నిస్తున్నారు. 2017%--%2021 మధ్య ఈక్విటీలు%--%క్రిప్టోల మధ్య సామీప్యత పెరిగింది. ఈ కాలంలో ఎస్‌అండ్‌పీ 500 ఇండెక్స్ వోలటిలిటీ, బిట్‌కాయిన్ ధర వోలటిలిటీ నాలుగు రెట్లు పెరిగింది. దీంతో ఈక్విటీ మార్కెట్ల మాదిరే క్రిప్టో మార్కెట్లు కూడా పడుతూ, లేచేవేనని ఇన్వెస్టర్లు భావించడం మొదలు పెట్టారు. 2020, 2021 ఈక్విటీ మార్కెట్ల ర్యాలీతో పాటు, క్రిప్టో కరెన్సీలు ర్యాలీ చేయడాన్ని పోలుస్తున్నారు. కానీ, స్టాక్స్‌లో నష్టాలు, క్రిప్టోల్లో నష్టాలకు మధ్య పోలికలేదు. మన ఈక్విటీ మార్కెట్లు గరిష్టాల నుంచి 20%లోపే దిద్దుబాటుకు గురయ్యాయి. కొన్ని స్టాక్స్ విడిగా 30%--%40% నష్టపోయాయి. కానీ, క్రిప్టోలు మరిన్ని నష్టాలను చూస్తున్నాయి.

భవిష్యత్తు..

క్రిప్టోల పతనం కచ్చితంగా ఇన్వెస్టర్ల నమ్మకాన్ని దెబ్బతీసినట్టు నిపుణులు చెబుతున్నారు. ద్రవ్యోల్బనాన్ని నియంత్రిత స్థాయికి తీసుకొచ్చేందుకు సమీప కాలంలోనూ వడ్డీ రేట్లు ఇంకా పెరిగే అవకాశాలే ఉన్నాయి. దీంతో వ్యవస్థలో లిక్విడిటీ మరింత తగ్గుతుంది. దీనివల్ల ఇన్వెస్టర్లలో రక్షణాత్మక ధోరణి కనిపించొచ్చు. 2021లో క్రిప్టోలను కొనుగోలు చేసినట్టయితే ఇప్పటికే సగం మేర వారి పెట్టుబడి కరిగిపోయి ఉంటుంది. మరోవైపు నియంత్రణ సంస్థల కత్తి వేలాడుతూనే ఉంటుందని తెలుసుకోవాలి. ఈక్విటీ మార్కెట్లు మెరుగైన నియంత్రణల మధ్య ప్రపంచవ్యాప్తంగా దశాబ్దాలుగా వేళ్లూనుకుని ఉన్నవి. క్రిప్టోలు అనియంత్రిత సాధనాలు. వీటిపై ప్రపంచవ్యాప్తంగా కేంద్ర బ్యాంకులు, ప్రభుత్వాల చర్యల ప్రభావం ఉంటుంది. ఆ మధ్య చైనా సైతం క్రిప్టో మైనింగ్‌పై కఠిన ఆంక్షలు పెట్టడం గుర్తుండే ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం విధించిన పన్ను కూడా ఇన్వెస్టర్లలో నిరుత్సాహానికి దారితీసినట్టు మార్కెట్ పరిశీలకులు చెబుతున్నారు. క్రిప్టో మార్కెట్లలో ఈ విధమైన ధోరణి కొంత కాలం పాటు కొనసాగుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇన్వెస్టర్లు ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్ వంటి ప్రధాన సాధనాలవైపు మళ్లీ వెళ్లిపోతారని కొందరు అంచనా వేస్తుంటే.. క్రిప్టోల మార్కెట్ క్రమంగా వికసిస్తుందని కొందరి అంచనా. "మరింత మంది ఇన్వెస్టర్లు క్రిప్టోల్లో ట్రేడింగ్, స్పెక్యులేషన్‌కు బదులు, వాటి మూలాలను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మార్కెట్ క్రమంగా పరిపక్వత వైపు అడుగులు వేస్తోంది"అని క్రిప్టో మేనేజ్‌మెంట్ సంస్థ కాసియో సీటీవో అనుజ్ యాదవ్ చెప్పారు. బిట్‌కాయిన్, ఎథీరియం, సొలానా, కొన్ని మీమ్ కాయిన్లకు ఇనిస్టిట్యూషన్స్ మద్దతు అయితే ఉంది. మిగిలిన వాటిని ఎవరు నడిపిస్తున్నారు, ఎవరు ఇన్వెస్ట్ చేస్తున్నారు? ఎవరికీ తెలియదు.

100 డాలర్ల దిగువకు చమురు ధర..
పెట్రో ధరలు ఎందుకు తగ్గడంలేదు!

భారత్‌లో క్రూడాయిల్ ధర బ్యారల్ 100డాలర్లకు దిగువకు చేరాయి. ఏప్రిల్ తర్వాత తొలిసారి బ్యారల్ ధర తగ్గడంతో వాహన దారులు ఫ్యూయల్ ధరలు తగ్గుతాయని ఊహించారు. కానీ వాటి ధరలు అలాగే కొనసాగుతాయని, ఇప్పట్లో పెరిగే అవకాశాలు లేవని మార్కెట్ నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దేశీయంగా ఏప్రిల్ 25న బ్యారెల్ క్రూడాయిల్ ధర 99.17 డాలర్లు ఉండగా..ఆ తర్వాత వాటి ధరల్లో హెచ్చు తగ్గులు కనిపిస్తూ వచ్చాయి. అయితే జులై 14న అదే క్రూడాయిల్ ధర బ్యారెల్ 99.76 డాలర్లు చేరింది. అంతర్జాతీయంగా మాంద్యం, డిమాండ్ - సప్లై వంటి భయాల కారణంగా ధర 5.5శాతం తగ్గింది.మార్కెట్‌లు ఒడిదుడుకుల మధ్య సౌదీ అరేబియా ముందస్తు ఉత్పత్తిని పెంచుతుందనే ఆశతో బెంచ్ మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ 100డాలర్ల కంటే ఎక్కువ పెరిగింది. కానీ యూఏఈ మాత్రం క్రూడాయిల్ ఉత్పత్తిని తగ్గించింది. అయితే ఈ తరుణంలో పెట్రోల్,డీజిల్ తగ్గిపోతాయనుకున్న వాహన దారులకు భంగపాటు ఎదురైంది. చమురు కంపెనీలు నష్టాల్ని పూడ్చుకునే ప్రయత్నం చేస్తున్నాయే తప్పా.. వాటిని వాహనదారులపై బదాలయించే ప్రయత్నం చేయడం లేదని తెలుస్తోంది.

నష్టాల నుంచి గట్టెక్కుతున్నారు.

క్రూడాయిల్ రేట్లు తగ్గడం వల్ల దేశీయ చమురు కంపెనీలకు ఊరట లభించినట్టయింది. గతంలో క్రూడాయిల్ బ్యారెల్ ధర 120 నుంచి 123 డాలర్ల వరకు వెళ్లిన నేపథ్యంలో.. కొనుగోలు చేయడానికి భారీ ఎత్తున ఖర్చు పెట్టాల్సి వచ్చేది. మే నెలలో కేంద్రం పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని లీటరుకు రూ.8, డీజిల్‌పై లీటరుకు రూ.6 తగ్గించడంతో చమురు కంపెనీలకు మరింత భారం పెరిగింది. ఎక్సైజ్ సుంకం తగ్గింపు, బ్యారల్ ధర పెరుగు ధరలతో చమురు కంపెనీలు క్రూడాయిల్‌పై భారీగా ఖర్చు చేశాయి. ఇప్పుడు ఆ నష్టాల్ని పూడ్చుకునేందుకు తక్కువకే ధరకే క్రూడాయిల్ బ్యారెల్‌ను కొనుగోలు చేస్తున్నాయి. పెట్రో ధరల్ని అలాగే కొనసాగిస్తున్నాయి.

ఇండియన్ ఆర్మీలోకి ప్రైవేట్ సంస్థలు! ఇప్పటికే..

కేంద్ర ప్రభుత?్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఆత్మానిర్భర్ భారత్ పథకం కింద మిలటరీ హార్డ్‌వేర్ విభాగంలోకి ప్రైవేట్ సంస్థల్ని ఆహ్వానించినట్లు పలు నివేదికలు వెలుగులోకి వచ్చాయి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ డిఫెన్స్ అక్విజేషన్ ప్రొసిజర్స్ (డీఏపీ) మ్యాన?్నవల్‌గా సవరించాలని నిర్ణయించింది. ఇండియన్ డిఫెన్స్‌కు (పీఎస్‌యూ) చెందిన ప్రభుత్వ రంగ సంస్థలు మిలటరీకి సంబంధించిన ఆయుధాలు తయారు చేసేవి. ఇప్పుడీ డీఏపీ సవరణలతో ప్రైవేట్ సంస్థలు ఎక్కువ భాగం డిఫెన్స్‌కు చెందిన ఆయుధాల్ని తయారు చేసేందుకు ఊతం ఇచ్చినట్లైందని నివేదికలు చెబుతున్నాయి. ప్రైవేట్ సంస్థల సహకారంతో ఇండియన్ మల్టీ రోల్ హెలికాప్టర్ (ఐఎంఆర్‌హెచ్)నను అభివృద్ధి, తయారీని కేంద్ర రక్షణ శాఖ ప్రయత్నిస్తుంది. దీంతో ఇండియన్ ఆర్మీ ఇన్వెంటరీలో ఉన్న రష్యా తయారు చేసిన ఎంఐ-17,ఎంఐ-8 హెలికాప్టర్‌లు భర్తీ కానున్నాయి. కాగా,13టన్నుల బరువైన ఈ మల్టీరోల్ హెలికాప్టర్ వైమానిక దాడిలో భారత సాయుధ బలగాల్ని రంగంలోకి దించడంతో పాటు, ఎయిర్ ఎటాక్, యాంటీ సబ్ మెరైన్, యాంటీ షిప్, మిలటరీ ట్రాన్స్ పోర్ట్, వీవీఐపీ వంటి విభాగాల్లో కీలకంగా పనిచేస్తుంది.

ఫ్రెంచ్ కంపెనీతో ఎంఓయూ

ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఎరో నాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్), ప్రైవేట్ సంస్థలు కలిసి వచ్చే ఏడేళ్లలో ఇండియన్ మల్టీ రోల్ హెలికాప్టర్ తయారీని పూర్తి స్థాయిలో ప్రారంభించేలా రక్షణ మంత్రిత్వ శాఖ ప్రణాళికను సిద్ధం చేసింది. దీంతో పాటు నేవల్ వేరియంట్‌తో సహా ఐఎంఆర్ హెచ్ ఇంజిన్‌ను తయారీ, ఉత్పత్తితో పాటు మద్దతు అందించేలా కొత్త జాయింట్ వెంచర్ కంపెనీని ఏర్పాటు కానుంది. జులై 8న ఈ జాయింట్ వెంచర్ సంస్థను ఏర్పాటు చేసేందుకు హెచ్‌ఏఎల్ తో విమానాల విడిభాగాల తయారీలో పేరు గాంచిన ఫ్రెంచ్ సంస్థ సఫ్రాన్ అవగాహన ఒప్పందంపై సంతకం చేసినట్లు సమాచారం.

పంత్ ధమాకా..

భారత కీపర్ అద్భుత సెంచరీ హార్దిక్ పాండ్యా ఆల్‌రౌండ్ షో చివరి వన్డేలో 5 వికెట్లతో జయభేరి 2-1తో సిరీస్ టీమిండియా వశం

భారత్ టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకుంటే... సిరాజ్ టాప్ లేపాడు. హార్దిక్ పాండ్యా మిడిలార్డర్‌ను కట్టడి చేశాడు. బ్యాటింగ్ పిచ్‌పై ఆతిథ్య జట్టు 259 పరుగులకే ఆలౌట్! ఇక్కడిదాకా బాగానే ఉంది. కానీ ఛేదన మొదలవగానే బ్యాటింగ్ కష్టాలు ఎదురయ్యాయి. భారత టాపార్డర్ (రోహిత్ 17, ధావన్ 1, కోహ్లి 17) చేసిన పరుగులు 35. విజయంపై ఆశల్లేని ఈ దశలో రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా భాగస్వామ్యం భారత్‌ను గెలుపు మలుపు తిప్పింది. పంత్ అజేయ శతకం సిరీస్ విజయాన్నిచ్చింది.

మాంచెస్టర్: వన్డే సిరీస్ కూడా 2-1తో భారత్ చేతికే చిక్కింది. మూడో వన్డేలో రోహిత్ శర్మ బృందం ఐదు వికెట్లతో ఇంగ్లండ్‌పై నెగ్గింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట ఇంగ్లండ్ 45.5 ఓవర్లలో 259 పరుగుల వద్ద ఆలౌటైంది. బట్లర్ (80 బంతుల్లో 60బీ 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), జేసన్ రాయ్ (31 బంతుల్లో 41బీ 7 ఫోర్లు) రాణించారు. హార్దిక్ పాండ్యా (4/24) వన్డే కెరీర్‌లో అత్యుత్తమ బౌలింగ్ గణాంకాలు నమోదు చేయగా... చహల్ మూడు, సిరాజ్ రెండు వికెట్లు తీశారు. అనంతరం భారత్ 42.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 261 పరుగులు చేసి గెలిచింది. రిషభ్ పంత్ (113 బంతుల్లో 125 నాటౌట్‌బీ 16 ఫోర్లు, 2 సిక్స్‌లు) గెలిపించేదాకా క్రీజులోనే నిలిచాడు. హార్దిక్ పాండ్యా (55 బంతుల్లో 71బీ 10 ఫోర్లు) ధాటిగా ఆడాడు. పంత్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ... హార్దిక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డులు లభించాయి.

రాణించిన బట్లర్, రాయ్

వరుస బౌండరీలతో మొదలైన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌కు ఆదిలోనే సిరాజ్ అడ్డుకట్ట వేశాడు. షమీ తొలి ఓవర్లోనే రాయ్ 3 ఫోర్లు బాదాడు. రెండో ఓవర్ వేసిన సిరాజ్ పరుగైన ఇవ్వకుండా బెయిర్‌స్టో (0), రూట్ (0)లను డకౌట్ చేశాడు. దీంతో రాయ్, స్టోక్స్ (29 బంతుల్లో 27బీ 4 ఫోర్లు) అడపాదడపా బౌండరీలతో స్కోరు పెంచారు. అయితే హార్దిక్ వీరిద్దరిని స్వల్ప వ్యవధిలో పెవిలియన్ పంపాడు. మొయిన్ అలీ (44 బంతుల్లో 34బీ 2 ఫోర్లు, 2 సిక్సర్లు) అండతో కెప్టెన్ బట్లర్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం లివింగ్‌స్టోన్ (31 బంతుల్లో 27బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), ఓవర్టన్ (33 బంతుల్లో 33బీ 1 ఫోర్, 1 సిక్స్) మెరుగ్గా ఆడటంతో ఇంగ్లండ్ పోరాడే లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందుంచింది.

పంత్ వీరోచితం

ఓపెనర్లు ధావన్ (1), రోహిత్ (17) సహా కోహ్లి (17)లను రీస్ టాప్లీ పడగొట్టేశాడు. భారత్ స్కోరు 38/3. సూర్యకుమార్ (16) కూడా తక్కువ స్కోరుకే అవుటయ్యాడు. 16.2 ఓవర్లలో 72 పరుగులకే కీలకమైన 4 వికెట్లు కూలాయి. ఇంకా బోలెడు ఓవర్లున్నా... పెద్ద లక్ష్యం... కానీ చేతిలో ఉన్న 6 వికెట్లలో బ్యాటర్స్ ముగ్గురే! ఇక గెలుపే కష్టమనుకున్న దశలో నింపాదిగా ఆడుతున్న పంత్‌కు జతయిన హార్దిక్ ధాటిగా ఆడాడు. ఈ క్రమంలోనే పాండ్యా 43 బంతుల్లో, పంత్ 71 బంతుల్లో ఫిఫ్టీలు పూర్తి చేసుకున్నారు. ఐదో వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం జోడించడంతో స్కోరు 200 దాటింది. కాసేపటికే పాండ్యా అవుటైనా... జడేజా (7 నాటౌట్) అండతో 106 బంతుల్లో (10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించిన పంత్... విల్లే వేసిన 42వ ఓవర్లో వరుసగా 5 ఫోర్లు బాదాడు. ఆ తర్వాతి ఓవర్ తొలి బంతికే పంత్ మరో బౌండరీ కొట్టి భారత్‌ను విజయతీరానికి చేర్చాడు.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ ఇన్నింగ్స్: రాయ్ (సి) పంత్ (బి) పాండ్యా 41బీ బెయిర్‌స్టో (సి) అయ్యర్ (సబ్) (బి) సిరాజ్ 0బీ రూట్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 0బీ స్టోక్స్ (సి అండ్ బి) పాండ్యా 27బీ బట్లర్ (సి) జడేజా (బి) పాండ్యా 60బీ అలీ (సి) పంత్ (బి) జడేజా 34బీ లివింగ్‌స్టోన్ (సి) జడేజా (బి) పాండ్యా 27బీ విల్లే (సి) సూర్యకుమార్ (బి) చహల్ 18బీ ఓవర్టన్ (సి) కోహ్లి (బి) చహల్ 32బీ కార్స్ (నాటౌట్) 3బీ టాప్లీ (బి) చహల్ 0బీ ఎక్స్‌ట్రాలు 17బీ మొత్తం (45.5 ఓవర్లలో ఆలౌట్) 259.

వికెట్ల పతనం: 1-12, 2-12, 3-66, 4-74, 5-149, 6-198, 7-199, 8-247, 9-257, 10-259.

బౌలింగ్: షమీ 7-0-38-0, సిరాజ్ 9-1-66-2, ప్రసిధ్‌కృష్ణ 9-0-48-0, హార్దిక్ పాండ్యా 7-3-24-4, చహల్ 9.5-0-60-3, జడేజా 4-0-21-1. భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రూట్ (బి) టాప్లీ 17బీ ధావన్ (సి) రాయ్ (బి) టాప్లీ 1బీ కోహ్లి (సి) బట్లర్ (బి) టాప్లీ 17బీ పంత్ (నాటౌట్) 125బీ సూర్యకుమార్ (సి)బట్లర్ (బి) ఓవర్టన్ 16బీ పాండ్యా (సి) స్టోక్స్ (బి) కార్స్ 71బీ జడేజా (నాటౌట్) 7బీ ఎక్స్‌ట్రాలు 7బీ మొత్తం (42.1 ఓవర్లలో 5 వికెట్లకు) 261.

వికెట్ల పతనం: 1-13, 2-21, 3-38, 4-72, 5-205.

బౌలింగ్: టాప్లీ 7-1-35-3, విల్లే 7-0-58-0, కార్స్ 8-0-45-1, అలీ 8-0-33-0, ఓవర్టన్ 8-0-54-1, స్టోక్స్ 2-0-14-0, లివింగ్‌స్టోన్ 2-0-14-0, రూట్ 0.1-0-4-0.

జడేజా విన్యాసాలు చూసి తీరాల్సిందే..

టీమిండియా ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా ఎలాంటి ఫీల్డర్?అనేది ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తన మెరుపు ఫీల్డింగ్‌తో పలుమార్లు రనౌట్లు.. మరి కొన్నిసార్లు అద్భుత క్యాచ్‌లు అందుకున్నాడు. బెస్ట్ ఫీల్డర్‌గా ముద్రపడిన జడేజా తాజాగా ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో మరోసారి ఫీల్డింగ్‌లో తన విన్యాసాలు రుచి చూపించాడు. ఈ మ్యాచ్‌లో బట్లర్, లివింగ్‌స్టోన్ క్యాచ్‌లు తీసుకోగా.. ఇందులో బట్లర్ క్యాచ్ మ్యాచ్‌కే హైలైట్ అని చెప్పొచ్చు. అప్పటికే జాస్ బట్లర్ అర్ధసెంచరీ పూర్తి చేసుకొని దాటిగా ఆడడం మొదలెట్టాడు. అతనికి తోడుగా లివింగ్‌స్టోన్ కూడా సిక్సర్లతో విరుచుకుపడుతున్నాడు. వీరిద్దరి భాగస్వామ్యం బలపడుతుందన్న తరుణంలో హార్దిక్ మ్యాజిక్ చేశాడు. హార్దిక్ షార్ట్‌బాల్ వేయగా.. బట్లర్ డీప్‌స్క్వేర్ లెగ్ మీదుగా భారీషాట్ ఆడాడు. బౌండరీ అనుకున్న తరుణంలో దాదాపు 25 గజాల దూరం నుంచి పరిగెత్తుకొచ్చిన జడేజా మొత్తం ఎడమవైపునకు తిరిగి డైవ్ చేస్తూ అద్భుత క్యాచ్ తీసుకున్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అంతకముందు లివింగ్‌స్టోన్ క్యాచ్ కూడా జడేజా దాదాపు ఇదే తరహాలో అందుకోవడం విశేషం.

మారని ఆటతీరు.. వన్డే కెరీర్‌లో అత్యంత చెత్త రికార్డు

విరాట్ కోహ్లి ఫేలవ ఫామ్ కొనసాగుతూనే ఉంది. ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో బ్యాటింగ్‌లో కోహ్లి మరోసారి నిరాశపరిచాడు. మూడు ఫోర్లతో మంచి టచ్‌లోనే కనిపించిన కోహ్లి మరోసారి ఆఫ్‌స్టంప్ బలహీనతను బయటపెట్టాడు. రీస్ టోప్లీ వేసిన గుడ్‌లెంగ్త్ డెలివరినీ అంచనా వేయడంలో పొరబడిన కోహ్లి ఫేలవమైన షాట్ ఆడి కీపర్ బట్లర్‌కు క్యాచ్ ఇచ్చాడు. దీంతో 17 పరుగుల వద్ద కోహ్లి కథ ముగిసింది. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌లో తొలి వన్డేకు దూరంగా ఉన్న కోహ్లి.. మిగిలిన రెండు వన్డేలు కలిపి 33 పరుగులు సాధించాడు. ఈ క్రమంలోనే కోహ్లి తన వన్డే కెరీర్‌లోనే అత్యంత చెత్త రికార్డు నమోదు చేశాడు. తాను వరుసగా ఆడిన చివరి ఐదు వన్డేల్లో కోహ్లి చేసిన పరుగులు 8,18,0,16,17. వరుసగా ఐదు వన్డేల్లో 20 పరుగులు ఒక్కసారి కూడా చేయకపోవడం కోహ్లికి ఇదే తొలిసారి. ఇంతకముందు ఎప్పుడు ఇలాంటి చేదు అనుభవం ఎదురుకాలేదు. మారని ఆటతీరుతో విసిగిస్తున్నప్పటికి కోహ్లకి అటు అభిమానుల నుంచి.. తోటి ఆటగాళ్ల నుంచి మద్దతు మాత్రం బాగానే ఉంది. ప్రతీ ఒక్క బ్యాటర్‌కు బ్యాడ్‌ఫేజ్ ఉండడం సహజం.. కానీ కోహ్లి విషయంలో ఇంకా దారుణంగా ఉంది. కోహ్లి సెంచరీ చేసి దాదాపు నాలుగేళ్లు అవుతుంది. 71వ సెంచరీ అందుకుంటాడని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న అభిమానులను మరోసారి నిరాశకు గురిచేసిన కోహ్లి.. సెంచరీ మాట పక్కనబెడితే ఫిఫ్టీ సాధించడానికి కూడా నానా కష్టాలు పడాల్సి వస్తుంది. ఇది ఇలాగే కొనసాగితే మరికొన్ని రోజుల్లో కోహ్లి జట్టుకు పూర్తిగా దూరమయ్యే అవకాశాలు ఉన్నాయి.

22 మందితో కూడిన జంబో టీమ్‌ను ప్రకటించిన భారత ఒలింపిక్ సంఘం

బర్మింగ్‌హామ్ వేదికగా జులై 28 నుంచి ఆగస్ట్ 8 వరకు జరిగే కామన్వెల్త్ క్రీడలకు జంబో టీమ్‌ను ప్రకటిం?చింది భారత ఒలింపిక్ సంఘం (ఐవోసీ). ఆటగాళ్లు, అధికారులతో కూడిన 322 మంది సభ్యుల వివరాలను ఐవోసీ శనివారం విడుదల చేసింది. ఈ బృందంలో 215 మంది అథ్లెట్లు, 107 మంది అధికారులు, ఇతర సహాయక సిబ్బంది ఉన్నారు. ఈ క్రీడల్లో తొలిసారి మహిళల క్రికెట్‌కు అవకాశం కల్పించడంతో హర్మాన్ నేతృత్వంలోని భారత మహిళా క్రికెట్ జట్టు కూడా వీరితో పాటే బర్మింగ్‌హామ్ ఫ్లైట్ ఎక్కనుంది. క్రీడాకారులందరికీ ఐదు గ్రామాల్లో వేర్వేరు చోట్ల వసతి ఏర్పాటు చేశారు. ఈ పోటీల్లో భారత్ 15 విభిన్న క్రీడా విభాగాల్లో పోటీ పడుతోంది. వీటితో పాటు నాలుగు పారా స్పోర్ట్స్‌లోనూ భారత్ పాల్గొంటుంది. ఐవోసీ ప్రకటించిన 215 మంది సభ్యుల బృందంలో నీరజ్ చోప్రా, పీవీ సింధు, లోవ్లీనా బోర్గొహైన్, మీరాబాయి చాను, బజరంగ్ పునియా, వినేశ్ ఫొగాట్, మనీకా బాత్రా, హిమ దాస్, తేజేందర్ పాల్ సింగ్ టూర్, అమిత్ పంఘాల్ వంటి మేటీ క్రీడాకారులు ఉన్నారు. కాగా, కామన్వెల్త్ గేమ్స్ చివరిసారిగా 2018లో ఆస్ట్రేలియా గోల్డ్‌కోస్ట్ వేదికగా జరిగిన విషయం తెలిసిందే. ఈ పోటీల్లో భారత్ పతకాల పట్టికలో మూడో స్థానంతో సరిపెట్టుకుంది. ఆస్ట్రేలియా అగ్రస్థానంలో నిలువగా.. ఇంగ్లండ్ రెండో స్థానంలో నిలిచింది.

సింగపూర్ ఓపెన్ విజేతగా పీవీ సింధు..

భారత స్టార్ షట్లర్ పీవీ సింధు తొలి సింగపూర్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఆదివారం(జూలై 17) జరిగిన ఫైనల్లో చైనాకు చెందిన వాంగ్ జి యిపై 21-9,11-21,21-15 తేడాతో సింధు విజయం సాధించింది. తొలి సెట్‌లో ప్రత్యర్థిపై పూర్తి ఆధిపత్యం చలాయించిన సింధు.. రెండో సెట్‌లో ఓడిపోయింది.అయితే నిర్ణయాత్మకమైన మూడో సెట్‌లో తిరిగి అద్భుతంగా పుంజుకున్న సింధు.. ఈ ఏడాదిలో తొలి సూపర్ 500 టైటిల్‌ను తన ఖాతాలో వేసుకుంది. కాగా వాంగ్ జి యి చివరి వరకు అద్భుతమైన రీతిలో పోరాడింది. ఇక పీవీ సింధుకు ఈ ఏడాది సీజన్‌లో ఇది మూడో టైటిల్. అంతకుముందు సయ్యద్ మోదీ, స్విస్ ఓపెన్‌లో సూపర్ 300 టైటిల్స్‌ను సింధు సాధించింది. ఇక ప్రతిష్టాత్మక సింగపూర్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న మూడో భారత ప్లేయర్‌గా సింధు రికార్డులకెక్కింది. కాగా గతంలో 2010లో సైనా నెహ్వాల్, 2017లో సాయి ప్రణీత్ సింగపూర్ ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నారు.

భారత్ ఖాతాలో మరో స్వర్ణం

చాంగ్వాన్ (దక్షిణకొరియా): అంతర్జాతీయ షూటింగ్ సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) ప్రపంచకప్‌లో భారత్ ఖాతాలో మరో బంగారు పతకం చేరింది. 50 మీటర్ల రైఫిల్ త్రి పొజిషన్‌లో ఐశ్వరి ప్రతాప్ సింగ్ తోమర్ పసిడి పతకంపై గురిపెట్టాడు. జూనియర్ ప్రపంచ చాంపియన్ అయిన ప్రతాప్‌కు సీనియర్ స్థాయిలో ఇది రెండో స్వర్ణం. గతేడాది న్యూఢిల్లీలో జరిగిన ప్రపంచకప్‌లోనూ ఈ మధ్యప్రదేశ్ షూటర్ విజేతగా నిలిచాడు. పురుషుల ఈవెంట్‌లో శుక్రవారం జరిగిన క్వాలిఫయింగ్‌లో 52 మంది తలపడగా... ప్రతాప్ సింగ్ 593 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచాడు. మరో ఇద్దరు భారత షూటర్లు చైన్ సింగ్ (586), సంజీవ్ రాజ్‌పుత్ (577)లు కూడా పోటీపడినప్పటికీ పతకం బరిలో నిలువలేకపోయారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-5-565, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035 T.S. Owned by Makam Gangadhar and
Printed at MGR Publications, H.No. 11-5-565, Venkateshwara Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035, Editor : B. Sridhar Yadav + 918121529009, RNI.No. APTEL/2013/51038